# మొక్కజొన్న సాగు.. దిగుబడి బాగు

- రెండేళ్లుగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

**కళ్యాణదుర్గం రూరల్:** కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో ఇంతకాలంగా బోరుబావుల కింద అరటి, బొప్పాయి, కర్బూజ, టమాట, వేరుశనగ పంటలు అధికంగా సాగు చేసేవారు. ఈ పంటలు సాగు చేసిన రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయిన సంఘటనలు కోకొల్లలు. ఈ తరుణంలో వ్యవసాయ డివిజన్‌లో రైతులు బోరుబావుల కింద మొక్కజొన్న సాగుపట్ల ఆకర్షితులయ్యారు. రెండేళ్లుగా వ్యవసాయ డివిజన్‌లోని ఆరు మండలాల్లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో రైతులు పంట సాగు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. మార్కెట్‌లో ధర కూడా నిలకడగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**అంతా హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనమే..**

రైతులు హైబ్రిడ్ రకం మొక్కజొన్న విత్తనాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు ఆరు కిలోల విత్తనం విత్తుతున్నారు. నాలుగు కిలోల సామర్థ్యం గల విత్తనం బ్యాగు రూ.800 నుంచి రూ.1,100 పలుకుతోంది. 90 రోజుల నుంచి 110 రోజుల్లో పంట చేతికందుతుంది. విత్తన సాగు సమయంలో ఖర్చులు అధికంగా ఉంటాయి. సేద్యం పూర్తి చేశాక, పైరు పెద్దదయ్యాక పెట్టుబడులు తగ్గుతాయి.

**ఎరువుల వాడకం..**

ఎకరాకు నత్రజని ఎరువు 40 కేజీలు వాడాలి, భాస్వరం ఎకరానికి 40 కిలోలు వాడాల్సి ఉంటుంది. చివరి దుక్కుల సమయంలో ఎరువు వాడాలి. పొటాష్ ఎకరానికి 16 కిలోలు వాడాల్సి వుండగా దుక్కుల సమయంలో సగం, పంట సాగు 45 రోజుల అనంతరం సగం వాడాలి.


మొక్కజొన్న సాగు చేసిన దృశ్యం


మొక్కజొన్న విత్తనాన్ని వేరుచేస్తున్న యంత్రం

కళ్యాణదుర్గం డివిజన్‌లో మొక్కజొన్న సాగు ఇలా..

| సంవత్సరం | ఖరీఫ్‌లో సాగు (హెక్టార్లలో) | రబీలో (హెక్టార్లలో) |
|---|---|---|
| 2021 | 373 | 298 |
| 2022 | 1,136 | 645 |

**మొక్కజొన్నతో నష్టం లేదు**



మొక్కజొన్న సాగుతో నష్టం లేదు. నేను రెండున్నర ఎకరాలలో రూ.50వేలు పెట్టుబడి పెట్టి పంటసాగు చేశాను. ఎకరాకు 30 కింటాళ్లు దిగుబడి రాగా 70 కింటాళ్లు రూ.2,230తో విక్రయించాను. పెట్టుబడి పోను రూ.లక్ష మిగిలింది.

– తిమ్మప్ప, రైతు, బోరంపల్లి

**ఆరు ఎకరాల్లో సాగు చేశా**



రబీలో ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. గతంలో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసి రూ.80 వేలు ఆదాయం పొందాను. ఈ ఏడాది కూడా మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాను.

– రవి, రైతు, కదిరిదేవరపల్లి

**మెలకువలు పాటించాలి**



మొక్కజొన్న సాగు చేసిన రైతులు మెలకువలు పాటించాలి. మొదటగా విత్తన శుద్ధి చేసుకోవాలి. కలుపునివారణ కోసం అట్రాజిన్ 500 మిల్లీలీటర్ల మందును ఎకరానికి పిచికారీ చేయాలి. నేలలోని సారవంతాన్ని బట్టి ఎరువు వాడాలి.

– జగదీష్, వ్యవసాయాధికారి

# పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ


కంబదూరు: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు


వజ్రకరూరు: పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న గుంతకల్లు డీఎస్పీ నరసింగరావు


గుమ్మఘట్ట: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

**కంబదూరు/శెట్టూరు:** ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులు సూచించారు. సోమవారం కంబదూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీఐ కె.శ్రీనివాసులు,తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ ఆంజనేయులుతో కలసి డీఎస్పీ పర్యవేక్షించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఎక్కడా అసాకర్యాలు కలగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే శెట్టూరు మండల కేంద్రంలోని (ప్రాథమిక పాఠశాల) పోలింగ్ బూత్ భవనం, మౌలిక వసతులను తహసీల్దార్ ఫణికుమార్‌తో కలసి డీఎస్పీ పరిశీలించారు. సీఐ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరెడ్డి, ఎస్‌ఐ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను సోమవారం గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికలను సంబంధించి షెడ్యూల్ విడుదలైన నేథ్యంలో వజ్రకరూరులో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల(167 , 72)లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ నెల 16న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్‌ఐ రాఘవేంద్రప్ప, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సుబ్బారావు, అరుణ, సీఓ నరేష్, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మఘట్ట:** మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌కుమార్, ఎస్‌ఐ సునీత సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర వసతులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

**బెళుగుప్ప:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప కోరారు. సోమవారం మండలంలోని బెళుగుప్ప, శీర్పి, ఎర్రగుడి, గంగవరం, దుద్దేకుంట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం నాయకుడు రాజారెడ్డి, మండల యువజన విభాగం నాయకులు శ్రీనాథ్‌రెడ్డి తదితరుల కలసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరులోక్‌రెడ్డి, రాజగోపాల్, గోవింద రెడ్డి, వెంకటరెడ్డి, నరిగన్న, తిప్పేస్వామి, కేశవ రెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న

## మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు

**కంబదూరు:** శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి లఘున్యాస పూర్వక, ఏకవార రుద్రాభిషేకం, అలంకరణం, పార్వతీ అమ్మవారికి సూక్తలలితా సహస్రనామ, కుంకమార్చన, భీమరాయస్వామికి పంచమృతాభిషేకం,అర్చన చేపట్టారు.అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## గాలిమారెమ్మ విగ్రహ ఊరేగింపు


మారెమ్మదేవత విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

**గుమ్మఘట్ట:** మండలంలోని వై.గుండ్లపల్లిలో ఉన్న గాలిమారెమ్మ దేవత ఆలయంలో గ్రామస్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం నూతన విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని అమ్మవారికి గంగపూజ, పుణ్యాహవాచనం, మహామంగళారతి తదితర పూజలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉపవాస దీక్షలతో తీసుకువచ్చిన నూతన విగ్రహాన్ని వేదావతి హగరికి జలధికి తీసుకెళ్లి పవిత్ర గంగాజలంతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. అనంతరం గ్రామంలో మేళతాళాలు, ఊరాలతో ఊరేగించారు.

## విగ్రహాలకు ముసుగు


ఇప్పేరులో వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుగు కప్పిన దృశ్యం

**కూడేరు:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సోమవారం మండలంలోని పంచాయతీ అధికారులు రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం కార్యాలయాల వద్ద, రోడ్ల పక్కన, ప్రధాన కూడల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. అలాగే ఇప్పేరు, కూడేరులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుగు కప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రానీయకండి

**కళ్యాణదుర్గం రూరల్:** వేసవి ఆరంభమైందని.. తాగునీటి సమస్య రానీయకుండా చూడాలని ప్రజా ప్రతినిధులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాలాజీ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, వైస్ ఎంపీపీ కాంతమ్మ మాట్లాడారు. ప్రధానంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ప్రజాప్రతినిధులు సూచించారు. అలాగే విద్యుత్ సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు నివేదికలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ జగదీష్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ తిరుపాల్‌నాయక్, విద్యుత్ ఏఈ సలీమ్, ఎంఈఓ విజయకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.


తాగునీటిపై చర్చిస్తున్న దృశ్యం

## సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

**శెట్టూరు:** మండలంలోని చెర్లోపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. మూడు రోజుల నుంచి మోటార్లకు సక్రమంగా విద్యుత్ అందిచడం లేదంటూ రైతులు సోమవారం రోడ్డు మీద నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఏఈ జయక్రిష్ణ, ఎస్‌ఐ యువరాజ్ అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. బ్రేక్ డౌన్ వల్ల సమస్య ఉందని, వెంటనే పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా కరెంట్ సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో చెర్లోపల్లి, లక్ష్మంపల్లి, బచ్చేహళ్లి రైతులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి కమ్యూనిటీ టాయిలెట్స్

**కూడేరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న కమ్యూనిటీ టాయిలెట్స్‌ను త్వరలో అందుబాటులో తీసుకువస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా సోమవారం తెలిపారు. స్వచ్ఛ భారత్ పథకం కింద ఒక్కో టాయిలెట్ గదిని నిర్మించేందుకు రూ.3 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. కూడేరు సచివాలయం-1, 2కు కలిపి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రెండు నిర్మిస్తున్నామన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు వీటిని వినియోగించుకోవచ్చన్నారు.

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**బొమ్మనహాళ్:** రాప్తాడులో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బొమ్మనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని ఎల్. విద్య, 8వ తరగతి విద్యార్థి ఫణిరాజు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సునీత, తబస్సుమ్, సరస్వతి తదితరులు విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శనగల విక్రయానికి రిజిస్ట్రేషన్

**కణేకల్లు:** రాష్ట్ర ప్రభుత్వం పప్పుశనగను కనీసమద్దతు ధరతో కొనుగోలు చేయనుందని, శనగల విక్రయం కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు ఏఓ శ్రవణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. క్వింటాల్ శనగ రూ.5,335తో కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకొన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయనున్న క్రమంలో దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించి నష్టపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎకరానికి ఆరు క్వింటాళ్ల ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## మండల మీట్ రేపు

**కణేకల్లు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ట

**కుందుర్పి:** మండలంలోని కెంచంపల్లిలో సోమవారం ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను ఘనంగా ప్రతిష్టించారు. భక్తులు అందించిన రూ.4 లక్షల విరాళాలతో గ్రామదేవత మారెమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలను నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.నాగప్ప తెలిపారు.ఆంజపేయ స్వామి ఆలయ పునరుద్ధరణకు గ్రామానికి చెందిన భక్తుడు అనుపల్లి పాలయ్య రూ.30వేలు విరాళంగా అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# చురుగ్గా హైమాస్ లైట్ల ఏర్పాటు పనులు

**ఉరవకొండ:** పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్న హైమాస్ లైట్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం వైఎస్సార్ సర్కిల్, బైపాస్, కణేకల్లు క్రాస్, గుంతకల్లు రోడ్డు వద్ద జరుగుతున్న పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న హైమాస్ లైట్ల ఏర్పాటు పనులు మరో రెండు వారాల్లో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పట్టణంలో రూ.5 కోట్లతో రోడ్లు, రూ.3 కోట్లతో జేజేఎం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్ పనులు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, శర్మాస్, ఆటో శీనా, కణేకల్లు రఫీక్, తాజుద్దీన్, శర్మాస్‌వలి, చాకలి చిన్నా, శేఖర్, కవిత రియాజ్ పాల్గొన్నారు.


వైఎస్సార్ సర్కిల్ వద్ద హైమాస్ లైట్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

# ఈ - క్రాప్ నమోదు తప్పనిసరి

**బెళుగుప్ప:** రైతులు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. మండలంలోని శీర్పి, బెళుగుప్ప, ఆవులెన్న, శ్రీరంగాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలకు సూచించారు. పంటల నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, కనీస మద్దతు ధర తదితర లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ పృథ్వీసాగర్, వీఆర్ఓ ఎర్రిస్వామి, వీఏఏలు శిల్ప, అఖిల, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

## సరోజినీనాయుడు ఔన్నత్యం ఎనలేనిది


మాట్లాడుతున్న మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఫరీసా

**రాయదుర్గం రూరల్:** స్వాతంత్య్ర సమరయోధురాలు, ప్రముఖ కవయిత్రి సరోజినీనాయుడు ఔన్నత్యం ఎనలేనిదని మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఫరీసా అన్నారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్ అధ్యక్షతన సోమవారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె జీవితం విద్యార్థినులకు మార్గదర్శకం కావాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగమణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం 'ఫ్యామిలీ డాక్టర్'

**బొమ్మనహాళ్:** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుల్తానా అన్నారు. సోమవారం మండలంలోని దర్గాహొన్నూరు సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 72 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుశీల, ఆరోగ్య కార్యకర్తలు హేమాంజలి, జైరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ శారదా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## 'ఎండీటీ'తో కుష్టువ్యాధి నయం


పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ అనుపమ జేమ్స్

**కూడేరు:** కుష్టు వ్యాధి పట్ల ఆందోళన వద్దని..బహుళ ఔషధం(ఎండీటీ)తో పూర్తిగా నయం చేయవచ్చని అడిషనల్ డీఎంహెచ్ఓ అనుపమ జేమ్స్ అన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన ముగింపు కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని లెప్రసీ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే మందుల ద్వారా నయం చేయవచ్చన్నారు. అనంతరం కుష్టు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ తిప్పేస్వామి, పీఎంఓలు సూర్యప్రకాష్ రెడ్డి, రవికుమార్, సూపర్ వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



## క్లుప్తంగా

### రుణాలు రెన్యూవల్ చేసుకోండి

**కంబదూరు:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు వచ్చే నెల 31 లోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి ముత్యాలప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట రుణాలను రెన్యూవల్ చేసుకునే రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, ఫొటోలను తీసుకురావాలని వారు సూచించారు.

### 16, 17న సమావేశాలు

**ఉరవకొండ:** నియోజకవర్గ పరిధిలోని విడపనకల్లు, వజ్రకరూరు, బెళుగుప్ప మండల కేంద్రాల్లో ఈనెల 16, 17 తేదీల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసులు హాజరవుతారన్నారు. 16న ఉదయం 9 గంటలకు విడపనకల్లు, మధ్యాహ్నం 3 గంటలకు వజ్రకరూరులో సమావేశం నిర్వహిస్తామన్నారు. 17న ఉదయం 9 గంటలకు బెళుగుప్పలో సమావేశం ఉంటుందన్నారు.

### చితంబర స్వామి రథోత్సవానికి ఆహ్వానం


మాజీ ఎమ్మెల్యే సతీమణిని ఆహ్వానిస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** కూడేరు మండలంలోని మరుట్ల-3వ కాలనీలో ఈనెల 19న సాయంత్రం నిర్వహించే చితంబర స్వామి రథోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సతీమణి భవనేశ్వరిని సోమవారం గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆహ్వానించారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సతీమణి రూ.20 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు ఎర్రిస్వామి, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాస్ నాయుడు, కేపీ రామాంజనేయులు, ఆర్. రామాంజనేయులు, బాలకృష్ణ, నరసింహులు, పెన్నోబిలేసు తదితరులు పాల్గొన్నారు.

### సేవాఘడ్‌కు మాలధారుల పాదయాత్ర

**వజ్రకరూరు:** మండలంలోని వెంకటాంపల్లిపెద్దతండా (రూపానాయక్‌తండా) గ్రామంలో సోమవారం పాదయాత్రగా ఇరుముడులతో సేవాలాల్ మాలధారులు సేవాఘడ్‌కు బయలుదేరారు. ముందుగా గ్రామంలోని సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడులతో సేవాలాల్ మాలధారులు పాదయాత్రగా సేవాఘడ్‌కు ప్రయాణమయ్యారు.

### స్కూటీ అపహరణ

**ఉరవకొండ:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సుజుకి యాక్సెస్ స్కూటీ (ఏఎఫ్39ఎఫ్‌యూ8141) సోమవారం అపహరణకు గురైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన వడ్ల సలీం అనే వ్యక్తి తన స్కూటీను బస్టాండ్ సమీపంలో పార్కింగ్ చేసి టీ తాగడానికి వెళ్లాడు. పది నిమిషాల వ్యవధిలోనే స్కూటీ కన్పించకపోవడంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు సమీపంలో సీసీ టీవీ పుటేజీలు పరిశీలించగా వాహనాన్ని దొంగ ఎత్తుకెళ్తున్న దృశ్యాలు కన్పించాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**శెట్టూరు:** మండలంలోని పెరుగుపాళ్యం గ్రామానికి చెందిన రవి, మంజునాథ కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 90 ఎంఎల్ 192, 180 ఎంఎల్ 72 టెట్రా ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ యువరాజ్ తెలిపారు.

### మంటల్లో జంబుగుంపల అటవీ ప్రాంతం


అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న మంటలు

**కుందుర్పి:** గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కుందుర్పి మండలంలోని జంబుగుంపల అటవీ ప్రాంతం మంటల్లో చిక్కుకుంది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా చెలరేగిన మంటలను గమనించి, అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానికుల సాయంతో మంటలు అదుపు చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అప్పటికే రెండు వేల ఎకరాల్లో విలువైన అటవీ సంపద, వన్యప్రాణులు మంటల్లో కాలిబూడిదయ్యాయి.